క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

పాల్వంచరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. మండల పరిధి కోడిపుంజుల వాగు గ్రామంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఎడవల్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రకు కొనసాగింపుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జోడో యాత్ర నిర్వహిస్తోందన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలు, రైతు డిక్లరేషన్‌ను ఇంటింటికి తీసుకెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, ప్రజలను ఏవిధంగా మోసం చేస్తుందో వివరిస్తున్నామన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ దేశాన్ని దోస్తులకు దోచిపెడుతుంటే, కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తామని అప్పులు, అవినీతి రాష్ట్రంగా మారుస్తున్నారని విమర్శించారు. పేద ప్రజల గురించి ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు.

దోషులను శిక్షించాలి

సింగరేణి(కొత్తగూడెం): చర్ల మండలానికి చెందిన సప్క రమేష్ హత్యతో సంబంధం లేకున్నా ఆదివాసీలను రోజుల తరబడి నిర్బంధించి వేధించడం సరికాదని ప్రజాపంథా నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా నాయకుడు కెచ్చెర్ల రంగారెడ్డి గురువారం కొత్తగూడెంలో పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చర్ల మండలానికి చెందిన ఆదివాసీ సప్క రమేష్ హత్యను తమ పార్టీ ఖండిస్తోందన్నారు. అయితే కేసు దర్యాప్తులో భాగంగా సంబంధం లేని పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని, అమాయకులను వదిలిపెట్టి అసలు దోషులను శిక్షించాలని కోరారు.

అనుమతులివ్వండి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ ప్రాజెక్ట్ విస్తరణ కోసం ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్ అధికారులను సింగరేణి డైరెక్టర్లు కలిసి విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో అటవీశాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(సి) అధికారి డాక్టర్ జి.త్రినాథ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్/ సైంటిస్ట్ తరుణ్‌లను అనుమతుల కోసం ఏరియా జీఎం షాలేమురాజు, డైరెక్టర్లు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జి.వెంకటేశ్వర్‌రెడ్డి, (ఎస్టేట్స్) డీఆర్ ప్రసాద్‌లు కలిశారు. ఓసీ ప్రాజెక్ట్ విస్తరణకు అనుమతులు ఇవ్వాలని అడిగారు. ఈ మేరకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు.

ఆమరణ దీక్షకు మద్దతు

పాల్వంచరూరల్: స్థానిక అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యపాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శిబిరంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్, ఎస్‌డీటీ హుస్సేన్, గంధం మల్లికార్జునరావు, గుడివాడ రాజేందర్, నబీగాస్ పాల్గొన్నారు.

తండాలో ఎమ్మెల్యే పర్యటన

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్ నాయక్‌లు గురువారం గోలియాతండా గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వీధులన్నీ కలియ తిరిగారు. సీసీ రోడ్లు ఎక్కడెక్కడ అవసరం ఉందో పరిశీలించారు. మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు. ఎంపీపీ భూక్యా రాధ, బోడ మంగీలాల్, చీమల సత్యనారాయణ, మూడు బాలు, ఇస్లావత్ బాలు పాల్గొన్నారు.

విచారణ జరిపించండి

కొత్తగూడెంఅర్బన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో లక్షలాది మంది నిరుద్యోగులు నష్టపోయారని చెప్పారు.

పల్లెప్రగతి పనుల పరిశీలన

సుజాతనగర్: సుజాతనగర్, మంగపేట గ్రామాల్లోని వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనాలను జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మంగపేటలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరైన పోషకాహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను వినియోగించడం లేదని, వీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, దివాకర్ పాల్గొన్నారు.

అంధకారంలో చిరువ్యాపారాలు

- ఫుట్‌పాత్, చిరు వ్యాపారులకు రూ.50లక్షలతో వ్యాపార సముదాయాలు
- ఆరు నెలలుగా విద్యుత్ మీటర్ల కోసం ఎదురుచూపు
- అవస్థలు పడుతున్న అమ్మకం, కొనుగోలుదారులు



దుకాణాల్లో చార్జింగ్ బల్బులు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులు

పాల్వంచ: బతుకు దెరువు కోసం ఫుట్‌పాత్‌లు, వివిధ కూడళ్లు, షాపుల ముందు చిరు వ్యాపారాలు చేసుకునే వారి కోసం ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వ్యాపార సముదాయాలు (షెడ్లు) నిర్మాణం చేసింది. చిన్నా చితక వ్యాపారాలు చేసుకునే వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో పాటు, పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, రోడ్లు విశాలంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో కేఎస్‌పీ రోడ్‌లో 40 షాపులు, తహసీల్ రోడ్డులో 30 షాపులను నిర్మించి ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కేఎస్‌పీ రోడ్డులో షాపుకు రూ.300, తహసీల్ రోడ్డులో షాపుకు రూ.200 చొప్పున మున్సిపాలిటీ అద్దె వసూలు చేస్తోంది. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో చాలా వరకు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. షాపులకు కనీసం విద్యుత్ సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. కరెంట్ మీటర్లు ఇవ్వాలని దుకాణదారులు కోరుతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేదని ఆరోపిస్తున్నారు. చార్జింగ్ బల్బులతో సాయంత్రం నుంచి రాత్రి వరకు షాపులను నిర్వహించుకుంటున్న దీనస్థితి. అవి లేనివాళ్లు చేసేదేమీ లేక 6 గంటలకే షాపులు మూసివేస్తున్నారు.

అంధకారంలో షాపుల నిర్వహణ...

ఈ షాపింగ్ నిర్మాణాల్లో ఎక్కువగా కూరగాయలు, పండ్లు, కొబ్బరిబోండాలు, టీ కొట్లు, ఫ్యాన్సీ, చెప్పులు, బట్టల దుకాణాలు ఉన్నాయి. కాగా సాయంత్రం సమయంలో వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. రోజంతా పనుల నిమిత్తం బిజీగా ఉండే వారు, ఉద్యోగులు ఇంటికి వెళ్లేటప్పుడు సాయంత్రం బజార్‌కు వచ్చి వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఇది వ్యాపారులకు కలిసోస్తుంది. కానీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న చిరువ్యాపారులకు మాత్రం విద్యుత్ సౌకర్యం లేక వ్యాపారాలు నడవడం లేదని వాపోతున్నారు. చార్జింగ్ బల్బులతో కొందరు నెట్టుకొస్తున్నారు. కరెంట్ లేని కారణంగా ఆయా షాపుల వద్ద భద్రత కూడా కరువైంది.

పట్టించుకోని అధికారులు...

కరెంట్ మీటర్లు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్, విద్యుత్ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మీటర్లు ఇవ్వాలని మున్సిపాలిటీ అధికారులు ఎన్‌పీడీసీఎల్ అధికారులు లేఖ రాసామని చెబుతుండగా, ఎన్‌పీడీసీఎల్ అధికారులు మాత్రం తమకు ఎలాంటి లెటర్ రాలేదని, అయినా అందరికీ కలిపి ఒకే మీటర్‌తో ఒక్కో బల్బు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. ఈ విషయంపై ఇరు శాఖలకు సమన్వయం లేని కారణంగా మధ్యలో చిరువ్యాపారులు నలిగిపోతున్నారు. సమస్య పరిష్కారమయ్యే దారి కనిపించడం లేదు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని బాధిత చిరువ్యాపారులు కోరుతున్నారు.



చీకటిపడగానే మూసివేస్తున్న షాపులు

చార్జింగ్ బల్బులు వాడుతున్నాం



మున్సిపాలిటీ అధికారులు కట్టించి ఇచ్చిన షాపులకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. చార్జింగ్ బల్బులతోనే షాపులను నడిపిస్తున్నాం. చార్జింగ్ అయిపోతే షాపును మూసేస్తాం. అవి కూడా లేని చాలామంది 6గంటలకే షాపు మూసేసి ఇంటికి వెళ్లిపోతున్నారు.

– సమీర్, ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



అధికారులు షాపులు కేటాయించారు. కానీ కరెంట్ మరిచారు. సాయంత్రం సమయంలోనే కొంత బేరాలు ఉంటాయి. కానీ కరెంట్ లేక ఇబ్బంది పడుతున్నాం. ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ మీటర్లు ఇచ్చి చిరువ్యాపారులను ఆదుకోవాలి.

– నాగమణి, షాపు నిర్వహకురాలు

సమస్యను పరిష్కరిస్తాం



విద్యుత్ శాఖాధికారులకు మీటర్లు ఇవ్వాలని లేఖ రాసాం. వారు అందరికీ కలిపి ఒక్కటే మీటరు ఇస్తాం అన్నారు. కానీ అందరికీ వేర్వేరుగా మీటర్లు ఇవ్వాలని మేం అడిగాం. మున్సిపాలిటీ పేరుతో ఇస్తే బిల్లు మాకు వస్తుంది. సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

– సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

ఆలయంలో సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జూలూరుపాడు: కాకర్ల గ్రామ సమీపంలోని పాలగుట్టపై స్వయంభూగా వెలిసిన శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాలస్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవ పూజల్లో భాగంగా గురువారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు, యువతులు బిందెలతో నీళ్లు తీసుకొచ్చి దేవతా విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11.16 గంటలకు శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాల స్వామి, శ్రీ నాగలింగేశ్వర స్వామి, నూతన దారు ధ్వజ విమాన శిఖరంతోపాటు శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు శ్రీ కృష్ణ సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రతిష్ఠామహోత్సవానికి గ్రామ ప్రజలతోపాటు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పేదల సొంతింటి కల నెరవేరేదెన్నడో?

ఇల్లెందు: పేదల సొంతింటి కల నెరవేరేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు మిర్యాల రంగయ్య అన్నారు. గురువారం ఇల్లెందు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల అందజేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు అధికార మార్పిడి జరుగుతున్నా పేదల బతుకులు మాత్రం మారటం లేదన్నారు. పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఇంటింటికి సీపీఐ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.సారయ్య, డి.శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, శ్రీనివాస్, శంషుద్దీన్, సత్యనారాయణ, ఆంజనేయులు, వలీ, యాదగిరి, కొమురయ్య, మోజెస్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

అభ్యంతరాల గడువు పెంచండి..

సింగరేణి(కొత్తగూడెం): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలను తెలియజేయటానికి గడువు కాలాన్ని పెంచాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్తగూడెం క్లబ్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో డ్రాలో వచ్చిన పేర్లను బహిర్గతం చేసి వాటి మీద అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. అభ్యంతరాలు తెలియజేయడానికి కేవలం మూడు రోజులు గడువు మాత్రమే ఇచ్చారని, ఇంత తక్కువ సమయంలో 36 వార్డుల పరిధిలో అభ్యంతరాలు తెలియజేయటం సాధ్యం కాదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో లిస్ట్ పెట్టిన సంగతి ఎవరికీ తెలియదని, అందుకే హడావుడిగా ఈ ప్రక్రియ ముగించాలనే ఆలోచనలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. సమగ్రమైన సమాచారం రావాలంటే వారం గడువు అవసరమని గడువు కాలాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులపై ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఆగ్రహం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

టేకులపల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఫోన్ చేస్తే.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించడం లేదని అధికారుల వద్ద ప్రజాప్రతినిధుల ఫోన్ నెంబర్లు ఉండవా.. ఇలాగైతే ఎలా అంటూ జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ భూక్యా రాధ అధ్యక్షతన గురువారం టేకులపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సమావేశం ప్రారంభమైంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో చర్చించి, తీర్మానించిన సమస్యల పరిష్కారం జరగకపోవడంతో ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సాక్షాత్తు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ల సొంత మండలంలోనే అధికారుల పనితీరు సరిగా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎండలు రోజురోజుకు తీవ్రంగా ఉంటున్నాయని, మండలంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. టేకులపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుడితో పాటు పలువురు ఆరోపించగా ఎంఈఓని వివరణ కోరారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు వెలుస్తున్నాయని వాటిని నియంత్రించాలని పలువురు మహిళా ప్రజాప్రతినిధులు కోరగా బెల్టుషాపుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆబ్కారీ శాఖాధికారులను ఆదేశించారు. మండలంలో మూడేళ్ల క్రితం పూర్తి చేసిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నేటికీ బిల్లులు మంజూరు కాలేదని సంబంధిత ప్రజాప్రతినిధులు తెలియజేయగా ఐటీడీఏ ఏఈని వివరణ కోరి నెలరోజుల్లో బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు, తహసీల్దార్ అమ్జద్ పాషా, సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ, ఎంపీఓ గణేష్ గాంధీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారలమ్మలకు 'ఎడవల్లి' పూజలు

సుజాతనగర్: కొత్త అంజనాపురం గ్రామ పంచాయతీ, మేడేపల్లి గ్రామంలో గురువారం జరిగిన సమ్మక్క, సారలమ్మ పూజల్లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దెల నిర్మాణానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు.

ఉపసర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



జూలూరుపాడు: ఉపసర్పంచ్‌ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా వెంగన్నపాలెం గ్రామ ఉపసర్పంచ్ దేవరకొండ కిరణ్ ఎన్నికయ్యారు. గురువారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 14న హైదరాబాద్‌లో ఉపసర్పంచ్‌ల సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందని చెప్పారు. ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లావుడ్యా రాములు నాయక్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కిరణ్ తెలిపారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: పట్టణంలోని 12 వార్డుకు చెందిన ఎండీ ఫరీద్ కుమార్తె ఎండీ సన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న శివసత్తు దండు సారయ్య(సారిక) గురువారం రూ.10 వేలు వితరణగా అందజేశారు.

బోరువెల్ లారీ సీజ్

టేకులపల్లి: అనుమతులు లేకుండా బోరు వేస్తున్న వాహనాన్ని గురువారం అటవీ అధికారులు సీజ్ చేశారు. టేకులపల్లి మండల ఫారెస్టు అధికారి ముఖ్తార్ హుస్సేన్ తెలిపిన వివరాలు.. తడికలపూడి రోడ్డులోని ఒండిబోడు వద్ద రిజర్వు ఫారెస్టు ఎంక్రోచ్‌మెంట్ ఏరియాలో బోరు వేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని సీజ్ చేశారు. హరిబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): స్థానిక రామవరం ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో 25 క్వింటాళ్ల బియ్యం మాయం చేసిన హాస్టల్ వార్డెన్ రామనర్సయ్యను తక్షణమే విధుల నుంచి తొలగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్, బుర్రా వీరభద్రం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వార్డెన్ కళాశాలలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యార్థులకు సరైన భోజనం, అందించటం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మెనూ పాటించకపోయినా జిల్లాస్థాయి అధికారి డీడీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సదరు అధికారిని అశ్వారావుపేట నుంచి డిప్యూటేషన్ మీద ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారో అధికారులు సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బియ్యం మాయంపై తక్షణమే విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలో క్రమబద్ధీకరణ పట్టాల జారీకి గతంలో 2014 కటాఫ్ డేట్ ఉండేదని దానిని 2020 వరకు పొడిగించే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి అంగీకరింపజేసినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు రెండురోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారని చెప్పారు. ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని ఎవరికైనా క్రమబద్ధీకరణ పట్టాల కోసం డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే వారి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. అత్యంత పారదర్శకంగా పట్టాల జారీ ఉంటుందని తెలిపారు. క్రమబద్ధీకణ ప్రజల చిరకాల స్వప్నమని, అది నెరవేర్చి పట్టాలు ఇప్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారం రోజుల్లో కలెక్టర్ కార్యాలయం నుంచి జీఓ విడుదల అవుతుందని తర్వాత నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు వివరించారు. కొత్తగూడెం-పాల్వంచ నగరాలను జంట నగరాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో రూ.115 కోట్లు, పాల్వంచ మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తా..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతోనే కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన, భూమిపూజ చేసి మాట్లాడారు. కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలోని 33వ వార్డులో సుమారు రూ.1కోటితో మార్కెట్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఎన్నికల వాగ్దానాలు అన్నీ నెరవేస్తున్నానని, కొత్తగూడెం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గణేష్ టెంపుల్ చైర్మన్ శంకర్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, ఉర్దూఘర్ చైర్మన్ అన్వర్ పాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నూతన పంప్‌హౌస్ పరిశీలన...

కొత్తగూడెం పట్టణానికి కిన్నెరసాని జలాలు పంపిణీ చేసే నిర్మాణంలో ఉన్న లక్ష్మీదేవిపల్లి మండలం కాల్వ తండా వద్ద పంప్ హౌస్‌ను గురువారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు.

ఐక్యంగా మండలాలు సాధిద్దాం..



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

టేకులపల్లి: ప్రజాభిప్రాయం ప్రకారం బోడు, కొమరారంలను నూతన మండలాలుగా, ఇల్లెందుని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చింతా ఉదయ్ అధ్యక్షతన బోడులోని రైతువేదికలో పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. మధు మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనులు అధికంగా నివసించే ఈ ప్రాంతాలను నూతన మండలాలుగా ప్రకటించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ ప్రాంతాలను మండలాలుగా ప్రకటిస్తే అధికార పార్టీకి ఉపయోగం ఉండదని, పాలనాధికారం రాదని, అందుకే ఈ ప్రాంతాలపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నామని గొప్పలు చెప్పే పాలకుల మాటలు నీటి మీద రాతలుగా మిగిలిపోయాయని అన్నారు. మండలాల సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు బోడు గ్రామంలో ఈనెల 29, 30 తేదీల్లో పురుషులకు వాలీబాల్ , ఏప్రిల్ 1న కొమరారంలో మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. క్రీడా పోటీల అనంతరం అన్ని గ్రామాల్లో ముద్ద ముట్టొద్దు-పొయ్యి వెలిగించొద్దు, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, దీక్షలు, సడక్ బంద్ లాంటి అనేక వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ సాధన కోసం జరిగే దశలవారీ ఉద్యమ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తుపాకుల నాగేశ్వర్‌రావు, కల్తి వెంకటేశ్వర్లు, పొడుగు నరసింహారావు, ఎట్టి నరసింహారావు, మోతీలాల్, చింతా నరసింహారావు, రామచంద్రు, కోటిలింగం, పూనెం కోటయ్య, రాజు, సీతారాములు, మాలు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మె



శిబిరంలో మాట్లాడుతున్న పద్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీఓఏల మూడు రోజుల సమ్మెను గురువారం కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. వీఓఏలకు పూలమాలలు వేసి సీఐటీయూ జిల్లా నాయకురాలు పద్మ సమ్మెను ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. కాటన్ యూనిఫామ్ పంపిణీ చేయాలని, మహిళా సంఘాల సభ్యులకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. మహిళా సంఘాలకు బ్యాంకు, శ్రీనిధి నుంచి వీఎల్ఆర్ డబ్బులు ఇప్పించాలన్నారు. ప్రతి గ్రామసంఘానికి పక్కా భవనం నిర్మించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.వీరన్న, కె.సత్య, గద్దల వెంకటేశ్వర్లు, ఎ.చంద్రలీల, ఎస్కే రేష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు



పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో..



జూలూరుపాడు: తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: ఇంటర్మీడియెట్ ద్వితీయ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పాల్వంచ మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 1,072మంది విద్యార్థులకు గాను 1,037మంది హాజరు కాగా 35మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీ జూనియర్ కళాశాలలో 166 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 162 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ శారద, ఎస్ఐ పోటు గణేష్ తనిఖీ చేశారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 127 మంది విద్యార్థులకు గాను 120 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు.



అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీ అస్తవ్యస్తం.. జనం అవస్థలు

టేకులపల్లి గ్రామ పంచాయతీ ఎ కాలనీతండాలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగు రోడ్లపైనే పారుతోంది. దుర్గంధంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమలు, ఈగలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. బొడ్రాయి వద్ద మరీ దారుణం. నడిచే పరిస్థితి కూడా లేదు. పాలకులు, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

- టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : ఎల్.కిరణ్, గ్రామకార్యదర్శి , టేకులపల్లి
సెల్ నంబర్ : 8008018031